క్లుప్తంగా

పాఠశాలకు హాకీ స్టిక్స్ వితరణ



పాఠశాలకు హాకీ స్టిక్స్ అందజేస్తున్న దాత

పులిచెర్ల(కల్లూరు): మండలంలోని ఎల్లంకివారిపల్లె ఉన్నత పాఠశాల విద్యార్థుల కోసం కావేటిగారిపల్లెకు చెందిన ఉప్పు లోకనాథం సోమవారం 8 గ్రాఫైట్ హాకీ స్టిక్స్, 12 టర్ఫ్ హాకీ బాల్స్ వితరణ చేశారు. ఆయనను హెచ్ఎం హరిశంకర్ అభినందించారు. కార్యక్రమంలో ఎంఈవో–2 పోకల తాతయ్య, పాఠశాల విద్యా కమిటీ చైర్మన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పిల్లలకు వాహనాలు ఇస్తే తల్లిదండ్రులపై కేసులు

పుంగనూరు: పిల్లలకు ద్విచక్రవాహనాలు, కార్లను ఇస్తే తల్లిదండ్రులపై కేసులు నమోదు చేస్తామని ఎంవీఐ సుప్రియ హెచ్చరించారు. ఆమె సోమవారం పుంగనూరు పట్టణంలో వాహనాల తనిఖీ చేపట్టారు. పలువురు పిల్లలు వాహనాలు నడుపుతుండడాన్ని గమనించారు. వారిని ఆపి కౌన్సెలింగ్ ఇచ్చారు. అనంతరం ఆమె విలేకరులతో మాట్లాడుతూ పిల్లలు వాహనాలు నడపడంతోనే రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు. పిల్లలు ఎక్కువగా వాహనాలు నడుపుతున్నారని, నిఘా పెట్టి వాహనాలను సీజ్ చేస్తామన్నారు. తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకుని, పిల్లలకు వాహనాలను ఇవ్వరాదన్నారు.

జిల్లా స్థాయి పోటీలకు విద్యార్థిని ఎంపిక



యశస్విని

వి.కోట: పలమనేరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం డివిజన్ స్థాయి స్కూల్ గేమ్స్ అండర్ 14 విభాగంలో రిథమిక్ యోగా పోటీలు నిర్వహించారు. ఇందులో వి.కోట హైస్కూల్‌లో 8వ తరగతి చదువుతున్న పీవీ. యశస్విని ప్రతిభ చూపి ప్రథమ స్థానంలో నిలిచి జిల్లా స్థాయికి ఎంపికైనట్టు పాఠశాల కరస్పాండెంట్ లోకేష్ తెలిపారు. విద్యార్థినిని ఉపాధ్యాయులు అభినందించారు.

ఎస్సీ, ఎస్టీలకు భూములు కేటాయించాలి

పుంగనూరు: ఎస్సీ, ఎస్టీలకు ప్రభుత్వ భూములు కేటాయించాలని ఏపీ ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు చిన్నరాయుడు డిమాండ్ చేశారు. ఆయన సోమవారం తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో అనేక మంది ఎస్సీ, ఎస్టీలు బతుకుదెరువు లేక కూలి పనులు చేసుకుంటున్నారని తెలిపారు. వచ్చే అరకొర ఆదాయంతో పిల్లలకు సరైన విద్యను కూడా అందించలేకపోతున్నారని పేర్కొన్నారు. వారికి మిగులు భూములు కేటాయిస్తే వ్యవసాయం చేసుకుని జీవనం సాగిస్తారని తెలిపారు. కార్యక్రమంలో దళిత నాయకులు బాలకృష్ణ, జనార్దన్, వరదరాజులు, చిన్నరాయప్ప, మణి తదితరులు పాల్గొన్నారు.

శివాలయంలో ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో స్వామి వారు

రొంపిచెర్ల: మండలంలోని బొమ్మయ్యగారిపల్లె పంచాయతీలో వున్న కట్ట కింద శివాలయంలో సోమవారం ఆశ్వీయుజ చతుర్దశి సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. స్వామి వారిని అర్చకులు మునిరాజశర్మ విశేషంగా అలంకరించారు. రొంపిచెర్ల, చిన్నగొట్టిగల్లు మండలాలకు చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. వారికి ఆలయ నిర్వాహకులు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

పలమనేరు ఏరియా ఆస్పత్రికి స్వచ్ఛ సేవా అవార్డు



అవార్డుతో పలమనేరు ఆస్పత్రి సూపరింటెండెంట్ మమతారాణి

పలమనేరు: పారిశుద్ధ్య నిర్వహణలో పలమనేరు ఏరియా ఆస్పత్రి స్వచ్ఛ ఆంధ్ర అవార్డుకు ఎంపికై ంది. ఆ క్రమంలో సోమవారం చిత్తూరులో అవార్డులు అందజేశారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ మమతారాణి జిల్లా అధికారుల నుంచి అవార్డు, ప్రశంసా పత్రం అందుకున్నారు. ఆస్పత్రిని శుభ్రంగా ఉంచడంలో సూపరింటెండెంట్ పాత్ర ఎంతో ఉందని పట్టణవాసులు తెలిపారు. ఆమెను పలువురు అభినందించారు.

నిరుపయోగంగా దోబీఘాట్





చౌడేపల్లెలో నిరుపయోగంగా వున్న దోబీ ఘాట్, దోబీ ఘాట్ ప్రారంభోత్సవం సందర్భంగా ఏర్పాటుచేసిన శిలాఫలకం

చౌడేపల్లె: మండల కేంద్రమైన చౌడేపల్లె నుంచి బత్తలాపురం వెళ్లే రోడ్డులో మారెమ్మ ఆలయ సమీపంలో ఏర్పాటుచేసిన దోబీఘాట్ నిరుపయోగంగా మారింది. దీన్ని 2018లో అప్పటి మంత్రి, స్థానిక ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి రూ.6 లక్షలతో ఏర్పాటుచేయించారు. బట్టలు ఉతకడానికి నీటి సరఫరా కోసం ప్రత్యేక బోరు, మోటారు సైతం అమర్చారు. అక్కడ చౌడేపల్లెకు చెందిన 20 కుటుంబాల వారు ఇక్కడ బట్టలు ఉతుక్కునే వారు. బోరు మోటారు మరమ్మతులకు గురైంది. పలుమార్లు అధికారులకు విన్నవించినా ఫలితం లేకపోవడంతో రజకులు అక్కడికి వెళ్లడం మానేశారు. భవనానికి అమర్చిన ఇనుప డోర్లను దుండగులు చోరీ చేశారు. ఉన్నతాధికారులు స్పందించి దోబీఘాట్‌ను పునరుద్ధరించాలని రజకులు కోరుతున్నారు.

చెరువును పూడ్చేస్తున్నా పట్టించుకోరా..?



బత్తలాపురం వెళ్లే రోడ్డులో చెరువు స్థలంలో తోలిన మట్టి



చెరువు స్థలంలో వేసిన బండరాళ్లు

- ప్రమాదకరంగా బండరాళ్లు, మట్టి
- నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తున్న ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు

చౌడేపల్లె: చౌడేపల్లె–బత్తలాపురం రోడ్డులోని చౌడేశ్వరిదేవి పెద్ద చెరువు వద్ద వున్న పల్లెలకు వెళ్లే రోడ్డు పక్కన కొందరు పెద్ద పెద్ద రాళ్లు, మట్టి, ఇళ్లు పగులగొట్టిన వ్యర్థాలు వేస్తున్నారు. తద్వారా చెరువును పూడ్చేస్తున్నారు. అలాగే రోడ్డు పక్కన వేసిన బండ రాళ్లు ప్రమాదకరంగా మారాయి. ఈ విషయం తెలిసినా అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చెరువు పూడ్చివేతను అడ్డుకుని, చెరువు స్థలాల్లో బండరాళ్లు, మట్టి, ఇతర వ్యర్థాలు వేయకుండా తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

వైఎస్సార్ సీపీ నేత కుటుంబానికి పరామర్శ



విశ్వనాథరెడ్డి మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ భరత్, నాయకులు

శాంతిపురం: తేనెటీగల దాడిలో గుండిశెట్టిపల్లికి చెందిన వైఎస్సార్ సీపీ నేత గాంధీ(విశ్వనాథరెడ్డి) మృతిచెందిన విషయం తెలిసిందే. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త భరత్ సోమవారం గ్రామానికి చేరుకున్నారు. గాంధీ మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు. మృతుడి సోదరుడు, వైఎస్సార్ సీపీ మండల కో కన్వీనర్ ప్రభాకర్‌రెడ్డి, వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. గాంధీ కుటుంబానికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు కోదండరెడ్డి, ప్రధాన కార్యదర్శి కృష్ణమూర్తి, మండల కన్వీనర్ బుల్లెట్ దండపాణి, నాయకులు విజయకుమార్, అశ్వత్‌బాబు, చలపతి తదితరులు పాల్గొన్నారు.

నేడు ఏ.కొత్తకోటలో వాల్మీకి మహర్షి విగ్రహ ప్రతిష్ట

చౌడేపల్లె: మండలంలోని ఏ.కొత్తకోట గ్రామంలో మంగళవారం వాల్మీకి మహర్షి విగ్రహాన్ని ప్రతిష్ఠించనున్నట్లు గ్రామస్తులు తెలిపారు. ఇందులో ఉమ్మడి చిత్తూరు జిల్లాల నుంచి వాల్మీకి నాయకులు పాల్గొననున్నారని తెలిపారు. విగ్రహ ప్రతిష్ట తర్వాత వాల్మీకుల హక్కులు, సమస్యల పరిష్కారానికి తీసుకోవాల్సిన కార్యాచరణపై చర్చిస్తామని వెల్లడించారు.

స్వచ్ఛ సర్వేక్షణ్‌లో పుంగనూరుకు ప్రథమ బహుమతి



కలెక్టర్ నుంచి అవార్డు అందుకుంటున్న కమిషనర్ మధుసూదన్‌రెడ్డి

పుంగనూరు: స్వచ్ఛ సర్వేక్షణ్‌లో పుంగనూరు మున్సిపాలిటీకి ప్రథమ బహుమతి లభించింది. చిత్తూరులో సోమవారం జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ అవార్డులు అందజేశారు. మున్సిపల్ కమిషనర్ మధుసూదన్‌రెడ్డి అవార్డు, సర్టిఫికెట్‌ను కలెక్టర్ చేతుల మీదుగా అందుకున్నారు. ఈ సందర్భంగా కమిషనర్, మున్సిపల్ చైర్మన్ అలీమ్‌బాషా, కౌన్సిల్ సభ్యులు, ఉద్యోగులు, కార్మికులను పలువురు పట్టణ ప్రముఖులు అభినందించారు.

నూతన వధూవరులకు ఆశీర్వాదం



సదుం: నూతన వధూవరులతో ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

సదుం: మండలంలోని 79 ఏ చింతమాకులపల్లె సర్పంచ్ మల్లికార్జున నాయుడు సోదరుని కుమార్తె లక్ష్మీపావని వివాహం అశోక్‌నాయుడితో జరగనుంది. వారిని సోమవారం వైఎస్సార్ సీపీ రీజనల్ కో–ఆర్డినేటర్, ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆశీర్వదించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సోమశేఖర్ రెడ్డి, వీరభద్రనాయుడు, సర్పంచ్ శ్రీనివాసులురెడ్డి, విజయరెడ్డి, నాగేశ్వరరావు, రాజా నాయుడు పాల్గొన్నారు.

భూముల రీసర్వేతో సమస్యలకు చెక్



ఏ.కొత్తకోటలో గ్రామసభ నిర్వహిస్తున్న ఆర్ఎస్‌డిటీ దొరస్వామి

చౌడేపల్లె: భూముల రీసర్వేతో సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని రీసర్వే డిప్యూటీ తహీల్దార్ దొరస్వామి తెలిపారు. రీసర్వే కోసం గ్రామాలకు వచ్చే అధికారుల బృందానికి ప్రజలు, రైతులు సహకరించాలని కోరారు. ఆయన సోమవారం ఏ.కొత్తకోట, పందిళ్లపల్లె, 29 ఏ చింతమాకులపల్లెలో గ్రామసభలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రీసర్వేలో భాగంగా తొలుత ప్రభుత్వ ఆస్తులను గుర్తిస్తామని తెలిపారు. అనంతరం గ్రామాల్లోని రైతుల పొలాలను సర్వే చేస్తామన్నారు. అధికారులకు సహకరించి సమాచారాన్ని అందజేయాలని సూచించారు. సమావేశంలో వీఆర్వో మల్లికార్జునరెడ్డి, సర్వేయర్లు మురళీకృష్ణ, సురేంద్ర, సుకన్య, విజయ్, నాగలక్ష్మి, సింధు తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదపుటంచున తహసీల్దార్ కార్యాలయం



దెబ్బతిన్న తహసీల్దార్ కార్యాలయం గోడ

గంగవరం: మండలంలోని తహసీల్దార్ కార్యాలయ భవనం గోడలు పగుళ్లతో ప్రమాదకరంగా మారింది. పైకప్పు సిమెంటు పెచ్చులు ఊడిపోయి కమ్మీలు కనిపిస్తున్నాయి. ఇటీవల కురిసిన వర్షాలకు గోడలకు నెమ్ము దిగడంతో పగుళ్లు పెద్దవయ్యాయి. ఈ భవనాన్ని 20 ఏళ్ల క్రితం నిర్మించారు. అప్పట్లో కాంట్రాక్టర్ పనులను నాశిరకంగా చేయడంతోనే ఇలా దెబ్బతినిందని ప్రజలు ఆరోపిస్తున్నారు. కార్యాలయానికి ప్రతిరోజూ వివిధ పనుల నిమిత్తం వందలాది మంది వస్తుంటారు. ఏదైనా ప్రమాదం జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి భవనానికి మరమ్మతులు చేయాలని కోరుతున్నారు.

బాలిక అదృశ్యంపై కేసు నమోదు

చౌడేపల్లె: మండలంలోని దుర్గసముద్రం పంచాయతీకి చెందిన ఓ బాలిక అదృశ్యమైనట్లు అందిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ నాగేశ్వరరావు తెలిపారు. బాలిక ఈ నెల 4వ తేదీన ఇంటి నుంచి వెళ్లిపోయింది. కుటుంబ సభ్యులు చుట్టుపక్కల వెతికినా ఆచూకీ లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాలిక ఆచూకీ తెలిసిన వారు చౌడేపల్లె పోలీసులకు తెలియజేయాలని ఎస్ఐ కోరారు.

జీఎస్టీ తగ్గింపుపై ప్రజలకు అవగాహన



తగ్గిన జీఎస్టీపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

పెద్దపంజాణి: కేంద్ర ప్రభుత్వం జీఎస్టీని తగ్గించిందని, దీంతో ప్రజలకు మేలు కలుగుతుందని పలమనేరు సర్కిల్ జీఎస్టీవో, మండల నోడల్ అధికారి ఎస్వీ ప్రసాద్ తెలిపారు. ఆయన సోమవారం శంకర్రాయలపేట, శివాడి, అప్పినపల్లి, చామనేరు, అమ్మరాజుపల్లి, రాజుపల్లి, పెద్దవెలగటూరు, కోగిలేరు సచివాలయాల పరిధిలోని గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ తగ్గించిన జీఎస్టీ వివరాలను వినియోగదారులకు కనిపించేలా బోర్డులు ఏర్పాటు చేయాలని వ్యాపారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీవో బాలాజి, డిప్యూటీ ఎంపీడీవో శారదా దేవి, ఎంఈవో గోపాల్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శులు బాలాజి, జయశ్రీ, ఏఈవో మురళి తదితరులు పాల్గొన్నారు.

యానాదులపై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలి



కుప్పంలో ర్యాలీ చేస్తున్న యానాదులు

కుప్పం: కుప్పం నియెజకవర్గంలో యానాదులపై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని యానాదుల సంఘం జిల్లా అధ్యక్షుడు తలపల చెంచు మల్లికార్జున రావు డిమాండ్ చేశారు. యానాదులు సోమవారం స్థానిక ఆర్టీసీ బస్టాండు నుంచి డీఎస్పీ కార్యాలయం వరకు ర్యాలీ చేశారు. అక్కడ నిరసన తెలిపారు. ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి సొంత నియోజకవర్గం కుప్పంలోనే బడుగు, బలహీన వర్గాల వారిపై దాడులు పెరిగాయని ఆరోపించారు. కుప్పం మండలం ఎంకేనూరులో అగ్రవర్ణాల వారు యానాదులపై దాడి చేయడం దారుణమన్నారు. దాడి చేసిన వారిపై కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని కోరారు. యానాదులకు రక్షణ కల్పించి భవిష్యత్తులో దాడులు పునావృతం కాకుండా చూడాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం డీఎస్పీకి వినతి పత్రం అందజేశారు. నాయకులు మోవూరు అడివయ్య, ఎలుగోటి రేవతి, తిరుపతి రావులమ్మ, నారాయణ, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

నాలుగు నెలలుగా అందని వేతనాలు



ఆర్ఎంకు వినతి పత్రం అందజేస్తున్న కార్మికులు

పలమనేరు: నాలుగు నెలలుగా వేతనాలు ఇవ్వకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని స్థానిక ఏరియా ఆస్పత్రిలో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులు వాపోయారు. వారు సోమవారం ఆర్ఎం సాయికిరణ్‌కు వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ ఆస్పత్రిలో 16 మంది కార్మికులు పని చేస్తున్నట్లు తెలిపారు. సకాలంలో జీతాలు ఇవ్వడం లేదని, దీంతో కుటుంబాల పోషణ కష్టంగా వుందని ఆవేదన వ్యక్తం చేశారు. అప్పులు చేసి కుటుంబాలను పోషించుకుంటున్నామని తెలిపారు. జీతాలు ఇవ్వాలని కాంట్రాక్టర్‌ను అడిగితే పట్టించుకోవడం లేదని ఆరోపించారు. అలాగే తమకు అవసరమైన యూనిఫాం, చేతి తొడుగులు, షూలు ఇవ్వాలని విన్నవించారు. కార్యక్రమంలో సీఐటీయూ నేత గిరిధర్, లోకేష్, బుజ్జమ్మ, గీతా, లలిత, మధు తదితరులు పాల్గొన్నారు.

దొంగలతో జాగ్రత్తగా ఉండాలి

పలమనేరు: పట్టణంలోని ఆర్టీసీ బస్టాండులో ప్రయాణికులు జాగ్రత్తగా ఉండాలని సీఐ మురళీమోహన్ తెలిపారు. ఈ మధ్య బస్టాండులో ఎక్కువగా చోరీలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో ఆయన సోమవారం బస్టాండులో పర్యటించారు. ప్రయాణికులతో మాట్లాడి పలు సూచనలు చేశారు. ఆయన మాట్లాడుతూ బస్సులు ఎక్కే సమయంలో విలువైన వస్తువులు వున్న బ్యాగులు, సెల్‌ఫోన్లు, పర్సులు తదితరాలను జాగ్రత్తగా వుంచుకోవాలని సూచించారు. బస్టాండు వద్ద అపరిచిత వ్యక్తులు చోరీలకు పాల్పడే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయన్నారు. ముఖ్యంగా పిల్లలతో ఉన్న మహిళలు, ఒంటరి మహిళలు మరింత జాగ్రత్తగా ఉండాలన్నారు. ఏదైనా ఇబ్బందులు కలిగితే బస్టాండులోని పోలీస్ హెల్ప్ డెస్క్‌కు సమాచారం ఇవ్వాలని పేర్కొన్నారు. బస్టాండులో మరిన్ని సీసీ కెమెరాలు ఏర్పాటు చేసేలా ఆర్టీసీ అధికారులతో చర్చించనున్నట్టు తెలిపారు.

వర్షానికి దెబ్బతిన్న పంటలు

పలమనేరు నియోజకవర్గంలో మూడు రోజులుగా భారీ వర్షాలు కురుస్తున్నాయి. వాగులు, వంకలు, నదులు ప్రవహిస్తున్నారు. చెరువుల్లోకి నీరు చేరుతోంది. టమాట, కూరగాయల పంట పొలాల్లోకి వర్షపు నీరు చేరింది. దీంతో చెట్ల వేర్లు కుళ్లిపోయి నష్టం వాటిల్లుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. చలిగాలులు ఎక్కువగా వీస్తుండడం పట్టు పురుగుల పెంపకానికి తీవ్ర ఆటంకంగా మారింది. మల్బరీ ఆకు వానకు తడిస్తే వాటిని పురుగులకు మేతగా వేయలేని పరిస్థితి వుందని రైతులు చెబుతున్నారు.

- పలమనేరు నియోజకవర్గంలో భారీగా వర్షాలు
- పొలాల్లో చేరిన వర్షపు నీరు
- దెబ్బతిన్న కూరగాయల పంటలు



ముసలిమొడుగు వద్ద నీట మునిగిన వరిపంట

పలమనేరు: పలమనేరు నియోజకవర్గంలో ఈ సీజన్‌లో ఎక్కువ మంది రైతులు టమాటా పంటను సాగు చేశారు. ప్రస్తుతం 400 హెక్టార్లలో కోత దశలో ఉంది. వర్షాలకు టమాటా కాయలపై మచ్చలు ఏర్పడ్డాయి. అంతేగాక కాయ పైకి చూడడానికి బాగున్నా లోపల కుళ్లిపోతోందని రైతులు చెబుతున్నారు. కాయ రంగు కూడా మారుతోంది. ఆరు నెలలుగా టమాటా కాయలకు తగిన గిట్టుబాటు ధరలు లేక తీవ్రంగా నష్టపోయామని, ఇప్పుడు వర్షాలతో సగం కాయలు చేలల్లోనే కుళ్లిపోయేలా ఉందని రైతులు వాపోతున్నారు. అలాగే బీన్సు, మిరప, వంగ, చిక్కుడు, బీర, కాకర తదితర పంటలతోపాటు బంతి, చామంతి తదితర పూల పంటలు కూడా నష్టాలు తప్పేలా లేదని చెబుతున్నారు. ప్రస్తుతం పండుగల సీజన్ అయినప్పటికీ పూలకు ధరలు లేవని, ఈ తరుణంలో వర్షం వల్ల పూల నాణ్యత తగ్గి ధరలు మరింతగా పడిపోయే పరిస్థితి నెలకొందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పట్టు పురుగుల పెంపకానికి కష్టం

వరుసగా కురుస్తున్న వర్షాలకు చలిగాలులు ఎక్కువగా వీస్తున్నాయి. పగటి ఉష్ణోగ్రతలు కూడా బాగా తగ్గిపోయాయి. దీంతో పట్టు పురుగుల పెంపకానికి తీవ్ర ఆటంకమేర్పడింది. పలమనేరు డివిజన్‌లో 5000 ఎకరాల్లో మల్బరీ సాగవుతోంది. ప్రస్తుతం పట్టు పురుగులను చంద్రికల్లో వేస్తున్నాయి. అవి గూళ్లను అల్లాలంటే 27 డిగ్రీల నుంచి 32 డిగ్రీల దాకా ఉష్ణోగ్రత ఉండాలి. పలమనేరు ప్రాంతంలో ఉష్ణోగ్రతలు 15 డిగ్రీలకు పడిపోవడంతో పట్టుపురుగులు గూళ్లను అల్లలేకపోతున్నాయని రైతులు చెబుతున్నారు. దీనికితోడు వర్షానికి మల్బరీ ఆకు తడిసిపోవడంతో పురుగులకు మేత అందించలేని పరిస్థితి ఏర్పడిందని వాపోతున్నారు.



పలమనేరు వద్ద వర్షానికి దెబ్బతిన్న టమాటా పంట

నీట మునిగిన వరి

భారీ వర్షాలకు కౌండిన్య నది ఉధృతంగా ప్రవహిస్తోంది. దీంతో నదీ పరివాహక ప్రాంతాల్లో పలుచోట్ల వరి పంట నీట మునిగింది. ముఖ్యంగా పలమనేరు మండలంలోని కాలువపల్లి జలాశయం వద్ద బ్యాక్ వాటర్ వల్ల వంద ఎకరాల్లో వరి పంటకు నష్టం కలిగింది. నదికి ఇరువైపులా రక్షణ గోడ నిర్మించాలని ఎన్నో ఏళ్లుగా డిమాండ్ చేస్తున్నా పట్టించుకునేవారు లేరని రైతులు వాపోతున్నారు. కౌండిన్య నది ప్రవహిస్తుండడంతో ముసలిమొడుగు నుంచి ఏటిగడ్డకు వెళ్లేందుకు వీలులేకుండా పోయింది.

పోషకాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

సదుం: పోషకాహారం తీసుకుంటే సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందని, అంగన్‌వాడీ కేంద్రాల్లో పంపిణీ చేసే పోషకాహారాన్ని గర్భిణులు, బాలింతలు సద్వినియోగం చేసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మల్లీశ్వరి తెలిపారు. ఆమె సోమవారం జోగివారిపల్లె అంగన్‌వాడీ కేంద్రంలో పోషకాహార మాసోత్సవం సందర్భంగా గర్భిణులు, బాలింతలకు పోషకాహారంపై అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ ఆకు కూరలు, చిరు ధాన్యాలు, గ్రుడ్లు, బెల్లం తదితరాల్లో మంచి పోషకాలు వుంటాయని తెలిపారు. పోషకాల లోపం వల్లే రక్తహీనత కలుగుతుందని వివరించారు.



సదుం: అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్ మల్లీశ్వరి